బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

- ఆ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణానాయక్

గరిడేపల్లి : గారకుంటతండాలో అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గరిడేపల్లి, ఏప్రిల్ 7 : బీఆర్ఎస్‌తోనే సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ అన్నారు. మండలంలోని గారకుంటతండాలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. అవి కేవలం వాగ్దానాలుగానే మిగిలిపోతున్నాయన్నారు. పదేండ్ల కాలంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ వందేండ్ల అభివృద్ధిని చేసి చూపిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ వంద రోజుల్లోనే రాష్ట్ర ప్రజలను వంద కష్టాలకు గురి చేస్తుందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఒక ఉద్యమ పార్టీ అని దానిలోని కార్యకర్తలంతా ఒక క్రమశిక్షణతో ఉంటారన్నారు. కానీ కొందరు స్వార్థపరులు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తమ వ్యక్తిగత పనులు చేయించుకునేందుకు పార్టీలోకి వచ్చి అధికారం పోగానే తిరిగి ఇతర పార్టీలకు వెళ్తున్నారని వారంతా వలస పక్షులాంటి వారని, అటువంటి వారిని లెక్కలోకే తీసుకోవద్దన్నారు. కార్యకర్తలు ఈ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్వారం పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, నాయకులు కీత రామారావు, మామిడి వెంకటేశ్వర్లు, మాశెట్టి శ్రీహరి, పీఏసీఎస్ డైరెక్టర్ గుగులోతు హేమ్లానాయక్, షాంపూనాయక్, బాలూనాయక్, నరేందర్‌నాయక్, రవీందర్‌నాయక్, లక్పతినాయక్, పాండు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అక్రమ కేసు పెట్టిన సీఐని సస్పెండ్ చేయాలి

- ఎన్‌హెచ్ఆర్‌సీ ఉమ్మడి జిల్లా చైర్మన్ షేక్ మోదీన్ పాషా

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ షేక్ మోదీన్ పాషా

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 7 : బాధితుల తరపున వెళ్లిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా విభాగం చైర్మన్ మాదాసు స్వప్నపై అక్రమ కేసు పెట్టిన సూర్యాపేట పట్టణ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఆ సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మన్ షేక్ మోదీన్ పాషా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇద్దరు చిరు వ్యాపారుల మధ్య జరిగిన ఘర్షణను పరిష్కరించాలని కోరుతూ పట్టణ సీఐ వద్దకు స్వప్న వెళ్లగా ఎలాంటి విచారణ చేపట్టకుండా దుర్భాషలాడి ఏకపక్షం వహిస్తూ స్వప్నపై కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ఈ విషయమై డీఎస్పీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మున్సిపల్ అధికారులు ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం అక్కడ ఏర్పాటు చేసిన కొబ్బరి బొండాల దుకాణాలను తొలగించాలన్నారు.

సమావేశంలో ఆ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు అనుములపూరి జానకిరాములు, ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రటరీ గుండె జనార్దన్, సూర్యాపేట జిల్లా చైర్మన్ బండ్ల రమేశ్, నల్లగొండ జిల్లా కన్వీనర్ ఆడెపు కృష్ణయ్య, జనరల్ సెక్రటరీ బరపటి సునీత, అనుములపూరి కృష్ణ, మేడి సాగర్ పాల్గొన్నారు.

ఘనంగా లయోల పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

సూర్యాపేట రూరల్ : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయోల పాఠశాల పూర్వ విద్యార్థులు

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 7 : సూర్యాపేట పట్టణ పరిధిలోని జనగామ క్రాస్‌రోడ్డులోని సెవింట్ గ్జేవియర్స్ లయోల పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పాఠశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీధర్, సైదిరెడ్డి, రమేశ్, కిశోర్, వజ్రయ, రవి, ఫాదర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసవీమాత లక్ష పారాయణ సంపూర్ణ హోమం

వాసవీ మాత లక్ష పారాయణ సంపూర్ణ హోమం నిర్వహిస్తున్న ఈగా దయాకర్ దంపతులు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 7 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భగవద్గీత మందిరంలో వాసవీ మాత సేవా సమితి అధ్యక్షుడు ఈగ దయాకర్‌గుప్తా విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి మాత లక్ష పారాయణ సంపూర్ణ హోమంతో పాటు సంతోషిమత కోటి సంపూర్ణ హోమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామ కృష్ణశర్మ, శివ జగన్నాథశర్మ వాసవీ మాత ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. గణపతి పూజతో పాటు సామూహిక లలిత, వాసవీ మాత పారాయణాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు యజ్ఞ ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ అధినేత మీలా మహదేవ్ దంపతులు, భగవద్గీత మందిర నిర్వాహకులు మొరిశెట్టి రామ్మూర్తి, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాశెట్టి అనంతరాములు, బండారు రాజా, వాసవీ భవన్ అధ్యక్షుడు తోట శ్యాంప్రసాద్, గోపారపు రాజు, బ్రాహ్మండ్లపల్లి మురళీదర్, నూకా వెంకటేశంగుప్తా, రాచర్ల వెంకటేశ్వర్ రావు, ఈగా దయాకర్, సంపత్, గండూరి పావనీకృపాకర్, ఉపేందర్, దేవరశెట్టి సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్ పెండింగ్ లేకుంటేనే మిల్లులకు ధాన్యం

- జీరో డెలివరీ, అత్యధిక బకాయి మిల్లులకు నో
- రెండు నెలల్లో సీఎంఆర్ బకాయిలు జీరోకు తేవడమే ధ్యేయం
- మొండి బకాయి ఉన్న వారిపై ఉక్కుపాదం

సూర్యాపేట, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : గత రెండు సీజన్ల నుంచి జిల్లాలో సీఎంఆర్ బియ్యం మొత్తానికే ఇవ్వని 12 మిల్లులతో పాటు అత్యధిక బకాయి ఉన్న మరో 25 మిల్లులకు ఈ యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కేటాయింపులకు చెక్ పడింది. జిల్లాలో సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయింపులపై 'ఈసారైనా సక్రమంగా సాగేనా' అనే శీర్షికన ఇటీవల నమస్తే తెలంగాణ దిన పత్రికలో వచ్చిన వార్తకు సివిల్ సప్లై కమిషనర్ స్పందించారు. ఈ మేరకు సక్రమంగా సీఎంఆర్ పెడుతున్న 34 మిల్లులకే ధాన్యం కేటాయించారు. వచ్చే రెండు నెలల్లో సీఎంఆర్ బకాయిలు జీరోకు తేవడమే ధ్యేయంగా మొండి బకాయి ఉన్న వారిపై ఉక్కుపాదం మోపి వసూలు చేయాలని, అవసరమైతే కేసులు నమోదు చేయాలనే ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. అలాగే జిల్లాలో గత రెండేండ్లుగా సీఎంఆర్ కోసం ధాన్యం తీసుకోని 27 మిల్లులకు ఈసారి ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కేటాయించాలంటూ సివిల్ సప్లై కమిషనర్ నుంచి హుకుం జారీ కావడంతో ఆ మేరకు జిల్లా అధికారులు కేటాయించారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ విషయంలో రాష్ట్రంలోనే ఏ జిల్లాలో లేని విధానం ఇక్కడ కొనసాగింది. ఇతర జిల్లాల్లో ఉన్న అన్ని మిల్లులకు సామర్థ్యాన్ని బట్టి అన్నింటికీ సమాంతరంగా కేటాయించగా ఇక్కడ మాత్రం వంద మిల్లులకు గాను 27 మిల్లర్లు ధాన్యం అసలే తీసుకోలేదు. మిగిలిన 73 మిల్లులకు కూడా ధాన్యం కేటాయింపులో సమతూకం పాటించకుండా ఇష్టారాజ్యంగా కేటాయింపులు జరిగాయి. గత యాసంగి, వానకాలం సీజన్‌లకు కలిపి జిల్లాలో సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయి ఉన్నది. వాటిలో 60 మిల్లుల నుంచి 2 లక్షల మెట్రిక్ టన్నుల బకాయి ఉండగా కేవలం 13 మిల్లుల నుంచే 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి ఉండడం వాటిలో కూడా 9 మిల్లుల నుంచి రెండు సీజన్లలో ఒక్క కిలో రైస్ కూడా రాలేదని ఈ లెక్కన సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు ఎలా జరిగాయో అర్థం అవుతున్నదని పలువురు మిల్లర్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటి వరకు కొన్ని మిల్లులకే ఇష్టారాజ్యంగా ధాన్యం కేటాయించడం వల్లే కస్టమ్ మిల్లింగ్ రైస్ బకాయిలు పేరుకుపోవడం మరోపక్క జిల్లాలోని మిల్లర్ల మధ్య చిచ్చురేగి రెండుగా చీలి రెండు అసోసియేషన్లు ఏర్పాటైన విషయం తెలిసిందే. దాంతో ఈసారి కస్టమ్ మిల్లింగ్ కోసం ధాన్యం కేటాయింపుల విషయమై రాష్ట్ర సివిల్ సప్లై కార్యాలయం దృష్టి సారించింది. గత రెండు సీజన్ల నుంచి జీరో సీఎంఆర్ నమోదైన మిల్లులు రేయింబవళ్లు నడుస్తూ నెలనెలా లక్షలాది రూపాయల విద్యుత్ బిల్లులు చెల్లిస్తుండగా ఆయా మిల్లుల నుంచి ఎందుకు బియ్యం రావడం లేదు? ఆ బియ్యం ఎటు పోతున్నాయి? అసలు స్థానిక అధికారులు ఏం చేస్తున్నారని ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ సీజన్‌లో అలాంటి మిల్లులకు సీఎంఆర్ కోసం ధాన్యం ఇవ్వకుండా ఆయా మిల్లుల నుంచి రావాల్సిన రైస్‌ను తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. అన్ని మిల్లులను తనిఖీలు చేసి ఆయా మిల్లుల్లో వర్క్ చేసిన ధాన్యం ఎంత ? విద్యుత్ బిల్లులు ఎంత చెల్లించారు? రైస్ ఎంత అప్పగించారో విచారణ చేసి వెంటనే రీకవరి చేయాలని ఆదేశాలు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. రెండు నెలల్లో జిల్లాలోని అన్ని మిల్లుల నుంచి బకాయి మొత్తం వసూలు చేయాలని ఆదేశిస్తూ బకాయి ఉన్న మిల్లులు ప్రధానంగా రెండు సీజన్లలో ఒక్క గింజ కూడా ఇవ్వని మిల్లులకు కేటాయించవద్దని సక్రమంగా పెడుతున్న మిల్లులకే కేటాయించాలనే ఆదేశాలు రావడంతో సక్రమంగా నడుస్తున్న 34 మిల్లులకు జిల్లా అధికారులు ధాన్యం కేటాయించారు. అయితే భారీగా బకాయి ఉన్న మిల్లుల యజమానులు కొందరు తిరిగి తమకు ధాన్యం కేటాయించాలంటూ అధికారుల వెంటపడి ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తుండగా వారి ఒత్తిడి ఏ మేరకు పనిచేస్తదో వేచి చూడాల్సి ఉన్నది.

మున్సిపల్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు

నేరేడుచర్ల పట్టణంలోని మిర్యాలగూడ స్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం

నేరేడుచర్ల, ఏప్రిల్ 7 : నేరేడుచర్ల మున్సిపల్ పాలకమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ రోడ్డులో గల బస్‌స్టాప్ వద్ద ఆదివారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వివిధ పనుల కోసం పట్టణానికి వచ్చే ప్రయాణీకులకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసి మున్సిపల్ సిబ్బందితో నీటిని అందిస్తున్నారు. అలాగే దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే చాలా మంది దాహార్తి తీర్చే అవకాశం ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ 2003-04 పదో తరగతి విద్యార్థులు

నేరేడుచర్ల, ఏప్రిల్ 7 : నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాల 2003-04 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎంలు పోరెడ్డి శ్రీరాంరెడ్డి, కొప్పుల రంగారెడ్డి, ఉపాధ్యాయులు పిన్నపు రెడ్డి చంద్రారెడ్డి, సువర్ణ, శ్రీనివాస్, దశరథ, సుందర్‌రావు, హెచ్ఎం మధు పాల్గొన్నారు.

మై హోం ఆధ్వర్యంలో వైద్య శిబిరం

మందులను పంపిణీ చేస్తున్న ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 7 : స్థానిక మైహోం ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని వేపలమాధవరం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఖమ్మం సంకల్ప హాస్పిటల్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా 522 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండల్‌రావు, మాజీ సర్పంచ్ సునీతా బాలరాజు, ప్లాంట్ జీఎం నాగేశ్వర్‌రావు, అడ్వైజర్ జగన్నాథరావు, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని టాటా ఏస్ వాహన డ్రైవర్ మృతి

చిలుకూరు, ఏప్రిల్ 7 : లారీ ఢీకొని టాటా ఏస్ వాహన డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన చిలుకూరు గ్రామ పరిధిలోని కవితా జూనియర్ కళాశాల వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుంచి హుజుర్‌నగర్ వైపు వస్తున్న టాటా ఏస్ వాహనాన్ని ఎదురుగా అతి వేగంతో వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టాటా ఏసీ డ్రైవర్ ఆదినారాయణ (45) అద్దాల్లో నుంచి రోడ్డు మీదపడి అక్కడిక్కడే మృతి చెందాడు. ఆదినారాయణది ఏపీలోని పిడుగురాళ్ల దగ్గర జాన్‌పహాడ్ గ్రామం. మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.

డీఆర్‌డీఏ మాజీ పీడీ కిరణ్‌కుమార్‌పై అట్రాసిటీ కేసు

చివ్వెంల, ఏప్రిల్ 7 : సూర్యాపేట డీఆర్‌డీఏ మాజీ పీడీ సుందరి కిరణ్‌కుమార్‌పై చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్ వెంకట్‌రెడ్డి, ఏపీఓ, బాధితుడు ఇరుగు నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది సెప్టెంబర్ 9న మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహాత్మాగాంధీ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక చేపట్టారు. స్టేజీ మీద కూర్చున్న సందర్భంలో టేబుల్ ఫ్యాన్ పెట్టలేదని అప్పటి పీడీ కిరణ్‌కుమార్ అందరిముందు తనను తిడుతూ అవమానించినట్లు నాగయ్య తెలిపాడు. వేదిక మీద కూర్చునే అర్హత లేదని, కింద కూర్చోవాలని ఆదేశించినట్లు వెల్లడించాడు. ఈ విషయమై కలెక్టర్, ఎస్పీని సంప్రదించినప్పటికీ న్యాయం జరుగకపోవడంతో రాష్ట్ర, జాతీయ ఎస్సీ కమిషన్లకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. కలెక్టర్, ఎస్పీని కమిషన్ ఆదేశించడంతో వారి ఆదేశాల మేరకు శనివారం రాత్రి డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మామిడిపల్లి బండరాళ్ల అమ్మకందారులపై చర్యలేవి?

- అదనపు కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

నాగారం, ఏప్రిల్ 7 : మండల పరిధిలోని మామిడిపల్లి ఎస్సారెస్పీ కాల్వ వెంట ఉన్న బండరాళ్లను కొందరు అక్రమార్కులు సైజు రాళ్లుగా మార్చి అమ్ముకుంటున్నా అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు. బుధవారం పత్రికల్లో వచ్చిన కథనాలకు అదనపు కలెక్టర్ స్పందించి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్సారెస్పీ ఈఈ విజయ్‌కుమార్‌ను ఫోన్‌లో ఆదేశించినప్పటికీ ఇంతవరకు చర్యలేవని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎస్సారెస్పీ కాల్వల వెంట అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని, ఇకనైనా కలెక్టర్ స్పందించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఈఈ విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా సంఘటనా స్థలం నుంచి ఈటాచి బండ్లను పంపివేస్తున్నట్లు తెలిపారు.

రైతులకు రుణమాఫీ చేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్లయ్య

నూతనకల్, ఏప్రిల్ 7 : ఎన్నికల్లో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతులందరికీ రుణ మాఫీ చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, చూడి లింగారెడ్డి, బత్తుల విద్యాసాగర్, బత్తుల విజయ్‌కుమార్, బత్తుల సాయిల్‌గౌడ్, గాడ్డుల లింగరాజు, మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

వడదెబ్బ తో మహిళ మృతి

కోదాడ రూరల్, ఏప్రిల్ 7 : మండల పరిధి తొగర్రాయి గ్రామానికి చెందిన కన్నెబోయిన కోటమ్మ (50) వడదెబ్బకు గురై ఆదివారం చనిపోయింది. గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధి అమరనేని వెంకటేశ్వర్‌రావు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట తుమాటి వరప్రసాద్‌రెడ్డి, కాసాని పుల్లయ్య, బాలేబోయిన ఏడుకొండలు, వేల్రాద్రి కన్నెబోయిన వెంకన్న, రామారావు, కిశోర్, కొండలు, మిరియాల అంజయ్య ఉన్నారు.

సజావుగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

తిరుమలగిరి : అనంతారం మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

తిరుమలగిరి, ఏప్రిల్ 7 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరిగిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష (6-10వ తరగతి) సజావుగా ముగిసింది. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో 133 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 113 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ వేముల బాలరాజు తెలిపారు.

నాగారం : మండల పరిధిలోని పసునూరు మోడల్ స్కూల్‌లో 92 శాతం మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను చీఫ్ సూపరింటెండెంట్ రమేశ్ కుమార్, డీఓ ఆర్.రాంబాబు పర్యవేక్షించారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కాశీం కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నయీం

కోదాడ టౌన్, ఏప్రిల్ 7 : కోదాడ పట్టణంలోని 33వ వార్డుకు చెందిన మినీ లారీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు షేక్.కాశీం పక్షవాతంతో నాలుగేండ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. నిరుపేద కుటుంబం కావడంతో రంజాన్ పండుగ ఖర్చుల కోసం మినీ లారీ వర్కర్స్ అసోసియేషన్ రూ.8 వేల ఆర్థిక సాయం చేసింది. ఈ నగదును కాశీం కుటుంబ సభ్యులకు సంఘం అధ్యక్షుడు, మోటార్స్ వర్కర్స్ యూనియన్ కార్మిక నాయకుడు షేక్.నయీమ్ ఆదివారం అందజేశారు. ప్రభుత్వ రవాణా రంగ కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సంఘం సెక్రటరీ రఫీ, మదార్, అబ్బు, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఆటో ప్రమాదంలో మరో మహిళ మృతి

లావణ్య (ఫైల్ ఫొటో)

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 7 : ఈ నెల 4న జిల్లా కేంద్రంలో మానసనగర్ వద్ద హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఆటో తప్పించబోతుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో మరో మహిళ మృతిచెందింది. ప్రమాద సమయంలో ముగ్గురు మరణించగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఏడుగురు స్వల్పంగా గాయపడ్డారు. తీవ్ర గాయాలైన వారిని చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో పరిస్థితి విషమించి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేసే కలకోట్ల లావణ్య (26) ఆదివారం మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పెట్రోల్ పైపు లీకై బైక్ దగ్ధం

మంటల్లో కాలిపోతున్న బైక్

మునగాల, ఏప్రిల్ 7 : పెట్రోల్ పైపు లీకై బైక్ దగ్ధమైన ఘటన మండలంలోని కలకోవ రోడ్డులో ఆదివారం జరిగింది. కలకోవ గ్రామవాసి, బాధితుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బైక్ పెట్రోల్ పైపు లీక్ అవడంతో మరమ్మతులు చేయించేందుకు మునగాలకు బైక్‌పై వస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు తెలిపాడు. మంటలను గుర్తించి వెంటనే బైక్‌ను రోడ్డుపక్కన ఆపినట్లు చెప్పాడు. మంటలు వ్యాపించి బైక్ దగ్ధమైనట్లు పేర్కొన్నాడు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అయేషా ఫహిమా

షేక్ అయేషా ఫహిమా

మేళ్లచెర్వు, ఏప్రిల్ 7 : మండలంలోని ప్రియా సిమెంట్స్ కాలనీకి చెందిన షేక్.అయేషా ఫహిమా జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైంది. పాండిచ్చేరిలో ఈ నెల 9 నుంచి జరుగనున్న 38వ జాతీయస్థాయి యూత్ నేషనల్ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఆమె ప్రాతినిధ్యం వహించనున్నది. అయేషా ఇటీవలే ప్రియా ఎడ్యుకేషనల్ అకాడమీ నుంచి 10వ తరగతి పూర్తి చేసింది. ఆమె తండ్రి ఇషాక్ ప్రస్తుతం చింతలపాలెం పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఇషాక్ కూడా బాస్కెట్ బాల్ జాతీయ క్రీడాకారుడు.

నల్లా కనెక్షన్‌కు మోటరు బిగిస్తే కనెక్షన్ తొలగిస్తాం

తిరుమలగిరి, ఏప్రిల్ 7 : మున్సిపాలిటీలో నల్లా కనెక్షన్లు ఉన్న వారు నల్లాలకు మోటర్లు బిగిస్తే శాశ్వతంగా కనెక్షన్లు తొలగించడంతో పాటు రూ.10 వేలు జరిమాన విధిస్తామని మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్ను ఈ నెల 30 లోపు చెల్లించిన వారికి పన్నుపై 5 శాతం మినహాయింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. పన్ను వసూళ్లకు ప్రతి ఆదివారం సైతం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

14 వరకు ఓటరు నమోదుకు అవకాశం

నూతనకల్, ఏప్రిల్ 7 : నూతన ఓటరు నమోదుకు ఈ నెల 14 వరకు అవకాశం ఉన్నదని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఓటు వేసి పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. ఓటరు జాబితాలో ఓటు ఉన్నది లేనిది పరిశీలించుకుని లేని పక్షంలో యాప్ ద్వారా గానీ, ఫారం-6 ద్వారా గానీ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.